Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 198 | Tuesday : 15.07.2025 | Price : 3/- | Pages : 4

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :198 | మంగళవారం 15 జూలై 2025 | వెల : 3 | పేజీలు : 4

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి సెల్ : 9440815774

# రేషన్ కార్డు అంటే పేదవారి ఆత్మగౌరవం.. గుర్తింపు



- నీరు తేవడమంటే.. గ్లాస్‌లో సోడా పోసినట్లు కాదు
- పదేళ్ల పాలనలో ఏ ఒక్కరికీ రేషన్ కార్డు ఇవ్వలేదు
- పేదవాడికి సన్న బియ్యం ఇచ్చి.. గుక్కెడు ముద్ద పెట్టాలని ఆలోచన సైతం గత ప్రభుత్వ పెద్దలు చేయలేదు
- బీఆర్ఎస్ హయాంలో రేషన్ షాపులు తెరవలేదు.. బెల్ట్ షాపులు తెరిచారు
- ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, నల్గొండ**

బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో ఏ ఒక్కరికీ రేషన్ కార్డు ఇవ్వలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. పేదవాడికి సన్న బియ్యం ఇచ్చి.. గుక్కెడు ముద్ద పెట్టాలని ఆలోచన సైతం గత ప్రభుత్వ పెద్దలు చేయలేదని మండిపడ్డారు. సోమవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అలాగే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, రూ.34.20 కోట్ల విలువైన పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో రేషన్ షాపులు తెరవలేదని.. బెల్ట్ షాపులు తెరిచారంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇస్తుంటే.. ఓర్వలేక తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయంటూ మండిపడ్డారు. రైతులు పండించిన పంటను కొనుగోలు చేస్తున్నామని.. బోనస్ సైతం ఇస్తున్నామని చెప్పారు. రేషన్ కార్డు అంటే పేదవారి ఆత్మగౌరవం.. గుర్తింపు అని ఈ సందర్భంగా ఆయన అభివర్ణించారు. పేదల ఆకలి తీర్చే ఆయుధమే రేషన్ కార్డు అని పేర్కొన్నారు ముఖ్యమంత్రి. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల వల్లే నేడు నల్గొండ జిల్లాకు నీళ్లు వస్తున్నాయని గుర్తు చేశారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పామని.. ఈ హామీని తమ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. అయితే తమ ప్రభుత్వం రైతు భరోసా ఎగ్గొట్టిందంటూ దుష్ప్రచారం చేశారని ప్రతిపక్షాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ కేవలం తొమ్మిది రోజుల్లోనే రైతులకు రైతు భరోసా నగదు అందించామన్నారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిన 18 నెలల కాలంలోనే రూ. 6,500 కోట్లు ఖర్చు అయిందని వివరించారు. తమ ప్రభుత్వం - మిగతా3లో



## విభేదాలు.. వివాదాలుగా మారకూడదు

- భారత విదేశాంగశాఖ మంత్రి జై శంకర్ సూచన
- దూరదృష్టితో ఆలోచించి ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది
- బాధ్యతాయుతంగా మన రెండు దేశాలు దానిని కొనసాగించాలి

# నేడు న్యూఢిల్లీకి సీఎం చంద్రబాబు



- న్యూఢిల్లీలో తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ !
- కేంద్ర మంత్రులతో సమావేశం కానున్న చంద్రబాబు నాయుడు
- తర్వాత మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నర్సింహారావు జీవితంపై ప్రసంగించనున్న సీఎం చంద్రబాబు నాయుడు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం న్యూఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నారు. మంగళవారం ఉదయం సీఎం చంద్రబాబు నాయుడు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12.00 గంటలకు ఆయన న్యూఢిల్లీకి చేరుకుంటారు. ఈ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి అమిత్ షా, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవి, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోపాటు జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి నారా - మిగతా3లో



## కాంగ్రెస్ పార్టీ బీసీల చాంపియన్

- గుడ్డుకు వెంట్రుక కట్టే పని పెట్టుకోవద్దని బీజేపీ నేతలకు విజ్ఞప్తి
- ఎంపీ లక్ష్మణ్ వ్యాఖ్యలకు మంత్రి పొన్నం కౌంటర్
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో ముందుకు వెళ్తాం
- రాష్ట్రానికి కేంద్రం నుంచి వచ్చే నిధులను ఆయనే ఆపుతున్నారు

3



## నేరాల రాజధానిగా బిహార్

- నిరుద్యోగ యువత హత్యలు చేస్తూ గూండాలుగా మారుతుంటే.. సీఎం నీతీశ్‌కుమార్ మాత్రం తన కుర్చీని కాపాడుకునేందుకే తాపత్రయపడుతున్నారు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



## బీసీలకు కాంగ్రెస్ అన్యాయం..

- తెలంగాణలో తాము అధికారంలోకి రావడం ఖాయం
- బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు
- కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే
- తమ కార్యకర్తల కళ త్వరలో నెరవేరబోతుంది


**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, నల్లగొండ**

అర్హత ఉన్న అందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ కార్యకర్తలకే రేషన్ కార్డులు ఇస్తున్నారని.. మిగతా వారి పరిస్థితి ఏమిటనీ ప్రశ్నించారు. రేషన్ బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వమే ఇస్తోందని స్పష్టం చేశారు. రేషన్ షాపుల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫొటో పెట్టాలని సూచించారు. - మిగతా3లో

## భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రాముఖ్యతను పౌరులు అర్థం చేసుకోవాలి



- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- పౌరులు తమ వాక్ స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ విలువలను అర్థం చేసుకొని స్వీయ నియంత్రణ, సంయమనం పాటించాలి
- 'తాము సెన్సార్‌షిప్ గురించి మాట్లాడటం లేదు.. ప్రజలు తమంతట తామే బాధ్యత వహించాలి
- సుప్రీంకోర్టు, రాష్ట్రం (ప్రభుత్వం) ఇలాంటి విషయాల్లో జోక్యం చేసుకోవాలని ఎవరూ కోరుకోరు



## గోవా గవర్నర్‌గా అశోక్ గజపతి రాజు

- లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవిందర్ గుప్తా
- హర్యానా గవర్నర్‌గా ప్రొఫెసర్ అషిమ్ కుమార్ ఘోష్,

# మా ఓపికను చేతగానితనంగా తీసుకోవద్దు



- చంద్రబాబు పాలనపై సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్ర ఆగ్రహం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి
- మా ప్రభుత్వం వచ్చాక తప్పుడు కేసులు అన్నింటినీ మళ్ళీ ఓపెన్ చేస్తాం
- వాటిపై న్యాయస్థానాల్లో పోరాటం చేస్తాం
- తప్పుడు కేసుల్లో ప్రమేయం ఉన్న అధికారుల్ని సైతం విచారిస్తామని స్పష్టం

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, తాడేపల్లి**

మా ఓపికను మీరు చేతగానితనంగా తీసుకోవద్దని కూటమి ప్రభుత్వానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మా ప్రభుత్వం వచ్చాక తప్పుడు కేసులు అన్నింటినీ మళ్ళీ ఓపెన్ చేస్తాం. వాటిపై న్యాయస్థానాల్లో పోరాటం చేస్తాం.. తప్పుడు కేసుల్లో ప్రమేయం ఉన్న అధికారుల్ని సైతం విచారిస్తామని స్పష్టం చేశారు. సోమవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొనసాగిస్తున్న రాక్షస పాలనపై సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడారు. - మిగతా3లో

## పుర మిత్ర, మనమిత్ర ద్వారా
# పురసేవలు వినియోగించుకోండి
### మునిసిపల్ కమిషనరు వి.శ్రీనివాసరావు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 14:** కుప్పం పురపాలక సంఘం ప్రజలకు విజ్ఞప్తి చేయడం ఏమనగా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన "పుర మిత్ర, మన మిత్ర" యాప్‌ను ప్రజలు ఉపయోగించడం వలన వారి యొక్క ప్రాపర్టీ ట్యాక్స్, వాటర్ చార్జెస్,టెడ్ లైసెన్స్ యొక్క వివరాలు మరియు ఇతర పురసేవలు, చెల్లిం పులు చేయడానికి కార్యాలయంకు వెళ్ళకుండా "పుర మిత్ర యాప్, మనమిత్ర" యాప్ ద్వారా ఏ సమయములో నైనా రియల్ టైం వివరాలను ప్రజలు తెలుసుకొని ఈ యాప్ ద్వారానే చెల్లిం పులు కూడా చేసుకోవచ్చును. కావున ఈ విషయాన్ని గమనించి ప్రజలందరూ "పుర మిత్ర యాప్, మనమిత్ర వాట్సాప్ 955230 0009 సేవలను వినియోగించు కోవాలని, యాప్‌ను డౌన్లోడ్ చేసి రిజిస్ట్రే షన్ చేయుటకు మునిసిపల్ సిబ్బంది. వచ్చినపుడు సహకరించవల సినదిగా ప్రజలకు విజ్ఞప్తిచేశారు.

# సుపరిపాలనలో తొలి అడుగు
### కార్యక్రమంలో తెలుగు తమ్ముళ్లు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 14:** కుప్పం మున్సిపాలిటీలో 18,20 వార్డులో తెలుగు తమ్ముళ్లు ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గడపగడపకు వెళుతూ ప్రజల సమస్యలను విచారిస్తూ, సంవత్సర కాలంగా తెలుగుదేశం ప్రభుత్వం అందిస్తున్న పరిపాలనపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలో టిడిపి అధికారం చేపట్టి సంవత్సరకాలం పూర్తయిన సందర్భంగా సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఇంటింటి సర్వే నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాలనలో ప్రజలను భాగస్వాములు చేయాలన్న ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి ఇంటింటి సర్వేకి పిలుపునిచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు వైద్యం శాంతరం, క్లస్టర్ ఇంచార్జ్ సోమశేఖర్, కో క్లస్టర్ శ్యామ్, విస్తరణ కమిటీ సభ్యులు ఎం,మంజునాథ్, బూత్ కన్వీనర్ ఖాసిం, కె ఎస్ ఎస్, నెంబర్లు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్: డీఎస్పీ పార్థసారథి



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 14:** కుప్పం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన డిఎస్పి కుప్పం రూరల్ సర్కిల్ పరిధిలో చోరీలకు పాల్పడిన నిందితుడు అరెస్ట్.. 4 ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన తమిళ నాడుకు చెందినశక్తివేలు.. నిందితుడి వద్ద సుమారు 5 తులాల బంగారం, 1 కేజీ వెండి ఆభరణాలు స్వాధీనం ..నిందితుడి పై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు.. చేసినట్టు ఆయన తెలియజేశారు.

## సుపరిపాలలో తొలి అడుగు
# ఇంటింటికి మన ప్రభుత్వ కార్యక్రమం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 14:** శ్రీకాళహస్తి పట్టణంలోని 28వ వార్డు బృందమ్మ కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు.. ఇంటింటికి మన ప్రభుత్వం కార్యక్రమం టిడిపి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. స్థానిక శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటికి వెళ్లి కరపత్రం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజలకు తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్లు, పెన్షన్లు, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇలాంటి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు అందజేస్తున్నారన్నారు. ఈపథకాలన్నీ ప్రజలకు అందుతున్నాయా లేదా అని ఇంటింటికి వెళ్లి అడిగి తెలుసుకున్నారు.. ఈ సందర్భంగా ప్రజలు కొన్ని సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. వాటన్నిటిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. వైసిపి పార్టీలో కొంతమందికే పథకాల అందిస్తే , కూటమి ప్రభుత్వంలో తన మన బేధం లేకుండా ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందుకున్నాయన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16 347 ఉద్యోగాలు కనిపించిన ఘనత ఒక చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ కంటా రమేష్, యూనిట్ ఇంచార్జ్ రమేష్ బాబు, బూత్ ఇంచార్జ్ భాస్కర్ గౌడ్, ఆనంద్ టిడిపి నాయకులు నాగరాజు గోపి, గుత్తా విజయ్ కుమార్ నాయుడు, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి
#### జనసేన జిల్లా కార్యదర్శి కొట్టేసాయి



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై14:** శ్రీకాళహస్తి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సోషల్ మీడియా వేదికగా కొన్ని పార్టీలకు చెందిన సంస్థల వారు శ్రీకాళహస్తి జనసేన పార్టీలో జరిగిన దురదృష్ట ఘటనలపై పవన్ కళ్యాణ్‌ని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవా లని శ్రీకాళహస్తి ఒకటవ పట్టణ సీఐ గోపి పిర్యాదు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కుమార్, మహేష్, గరికపాటి చంద్ర, కవిత, పేటచంద్ర, పేట చిరంజీవి, పగడాల ప్రతాప్, ఈర్ల చిరంజీవి, సురేష్, బద్రి, మోహన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎన్ఆర్ కాలేజీలో శక్తి యాప్ పై అవగాహన





**పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 14:** పీలేరు అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యా సాగర్ నాయుడు అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి సూచనల మేరకు పీలేరులోని సిఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు శక్తి ఆప్ గురించి వివరిం చడం జరిగింది. పలువురు మహిళలు తాము ఎదుర్కొంటున్న వేధింపుల నుంచి ఎలా బయటపడాలో అర్థంకాక సతమత మవుతుంటారు. ఇక వారికి ఎలాంటి ఆందోళనా అక్కర్లేదు. ఏపీ పోలీసు శాఖ తీసుకొచ్చిన'శక్తి' యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని, అందులో 'SOSఆప్షన్ పై నొక్కితేచాలు, నిమిషాల్లో పోలీసులు ఘటనా స్థలికి వచ్చి, రక్షిస్తారు. ఒంటరిగా ప్రయాణం చేసేటప్పుడు 'శక్తి' యాప్‌లో 'సేఫ్ ట్రావెల్' ఆప్షన్‌ను ఎంచుకుంటే చాలు, ధీమాగా, ధైర్యంగా, సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవచ్చునని హెడ్ కానిస్టేబుల్ దశరథ్ అన్నారు. రాష్ట్రంలోని మహిళలు, చిన్నారుల భద్రత, రక్షణ కోసం పోలీసుశాఖ ఈ 'శక్తి' యాప్‌ను అందు బాటులోకి తీసుకొచ్చిందనీ, ఫోన్ ఊపినా పోలీసులు వస్తారని: అత్యవసర పరిస్థితులు, ఆపదలో చిక్కుకున్న మహిళలు ఈ యాప్ ఓపెన్ చేసి అందులోని ఆప్షన్ పై నొక్కితే, వెంటనే 10 సెకన్ల నిడివిగల వీడియో,ఆడియో ఆటోమేటిక్‌గా రికార్డై ఘటనా స్థలం లొకేషన్‌తో సహా పోలీసు కంట్రోల్ రూమ్‌కు వెళ్లిపోతుంది. దీంతో బాధితురాలు ఎటువంటి పరిస్థితుల్లో ఉన్నారో పోలీసులకు అర్థమవుతుంది. వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి వచ్చి రక్షిస్తారు. యాప్ సెట్టింగ్స్‌లోని 'హ్యాండ్ గెస్చర్' అనే ఆప్షన్‌ఆన్ చేసి పెట్టుకుంటే, 'SOS బటన్ నొక్కలేని పరిస్థితుల్లో ఉన్నా సరే, ఫోన్ అటూఇటూ గట్టిగా ఊపినా పోలీసు కంట్రోల్ రూమ్‌కు సమాచారం చేరుతుందని కానిస్టేబుల్ సుధాకర్ అన్నారు .మహిళా పోలీస్ శోభారాణి మాట్లాడు తూ మహిళలు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఒంటరిగా ప్రయాణించే సందర్భాల్లో యాప్‌లోని 'సేఫ్ ట్రావెల్' ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలని. అందులో 'న్యూ ట్రాక్ రిక్వెస్ట్'లోకి వెళ్లి బయల్దేరిన ప్రాంతం, గమ్యస్థానం వివరాలు, వెళ్తున్న వాహనం నంబరు తదితరాలు ఎంటర్ చేయాలి. వాహనాన్ని,అది వెళ్లే మార్గాన్ని పోలీసు కంట్రోల్ రూం నుంచి గమనిస్తారు. వాహనం నిర్దేశిత మార్గంలో కాకుండా వేరే మార్గంలో వెళ్తుంటే, వెంటనే స్థానిక పోలీసులను అప్రమత్తం చేసి, ఆమెను కాపాడతారని అన్నారు. గృహహింస, కుటుంబ తగాదాలు తదితర అంశాలపై ఫ్యామిలీ కౌన్సెలింగ్ తీసుకునేందుకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందనీ ఈ సందర్భంగా కళాశాలలోని విద్యార్థిని విద్యార్థులకు వారి సెల్ ఫోన్లలో ఈ యాప్ ను ఇన్స్టాల్ చేయించారు. ఈ కార్యక్ర మంలో సిఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లావణ్య, అధ్యాపకులు రాధాకృష్ణ, నరసింహులు, చంద్రశేఖర్, సంతోష్, జానకి, అజిత, రషీద మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# బీజేపీ జెండా ఆవిష్కరణ



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 14:** వెదురుకుప్పంమండలంలో తిరుమల రాజుపురంలో బీజేపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా ఎన్నికైన చెంగారెడ్డి అభినందనసభ మండల అధ్యక్షుడు బి.అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగాజరిగింది. ఈకార్యక్రమంలో జిల్లాఅధ్యక్షులు జగదీశ్వర్ నాయుడు మాట్లాడుతూ, చెంగారెడ్డి పార్టీకి అహర్నిశలు చేసిన సేవలు గుర్తించిన జిల్లా పార్టీ ఈయనకు రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా పదవి వచ్చిందని తెలియజేశారు. చెంగ రెడ్డి మాట్లాడుతూ ఈ పదవి రావడానికి కృషిచేసిన జిల్లా అధ్యక్షులు జగదీశ్వర్ నాయుడుకి, పురంధేశ్వరికి, మాధవన్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెదురుకుప్పంమండలం అధ్యక్షులు అశోక్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మనివర్మ, జిల్లా కన్వీనర్ జికె చౌదరి, నెల్లూరు ఇంచార్జి రాజేంద్రన్, కోశాధికారి సవిరెడ్డి మురళి, ప్రధాన కార్యదర్శులు బాలాజీ, గోపి,ఉపాధ్యక్షులు సోమురాజు, మోహన్ రెడ్డి, యువమోర్చ అధ్యక్షులు రామకృష్ణ రెడ్డి,మహిళ మోర్చా అధ్యక్షులు మల్లికా, బిసి మోర్చా మురళి, వివిధ మండలాల అధ్యక్షులు,టీడీపీ నాయకుడు గుణశేఖర్ రెడ్డి,జనసేన నాయకులు యతీశ్వర్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు గోవిందరెడ్డి, విజయ్ భాస్కర్ రెడ్డి, యువ నాయకుడు దామోదర్ రెడ్డి కార్యకర్తలు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసి దుశ్యాలువతో సత్కరించారు.

# పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 14:** 2009-10 ZPHS దేవలంపేట హై స్కూల్ నందు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం - హెడ్మాస్టర్స్ గుర్రప్ప సార్ మరియు శాంతి మేడం. టీచర్స్ - వెంకటేష్ సార్, లక్ష్మణ్ నాయుడు సార్, తేజ మేడం, అశోక్ సార్, బాలాజీ సార్ తదితరులు..స్టూడెంట్స్ - రాజు, ఉమాశంకర్, మధు, సోమశేఖర్, కరుణాకర్, తదితరులు. పాల్గొన్నారు.


# కట్టమంచి మైదా సెట్ రోడ్డు అభివృద్ధి చేయాలి



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 14:** చిత్తూరు జిల్లా కట్టమంచి నుంచి మైదా ఫ్యాక్టరీ వరకు వెళ్ళు రోడ్డు పరిస్థితి మైదా ఫిగర్ వద్ద అతి దారుణంగా ఉండడం, వలన వాహనాలకు స్కూల్ బస్సులకు తీవ్ర ఇబ్బంది. కలుగుతు న్నాయి, చిన్నపాటి వర్షానికి గుంతలు ఏర్పడి చెరువుల్లాగా తలపిస్తున్నాయి. ఈ గుంతల్లో నీళ్లు చదవడం వలన వంతు యొక్క లోతు తెలియకపోవడంతో స్కూటర్ వాహనదారులు,సైకిల్ వాహనదారులకు, ప్రైవేటు స్కూల్ వాహనాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున ఈ గుంతలను కనీసం మట్టితోన కపోవాలని స్థానికులు కోరుతున్నారు.

# శాంతిపురం సింగల్ విండో చైర్మెన్‌గా ఎస్ గోపాల్

**శాంతిపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 14:**




సింగిల్ విండో చైర్మన్ పదవిని కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం చెంగుబల్ల గ్రామానికి చెందిన తెదేపా సీనియర్ నాయ కుడు ఎస్.గోపాల్‌ను నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తనపై ఎంతో నమ్మకం గా అప్పచెప్పిన పదవికి త్రికరణ శుద్ధితో పనిచే స్తానని రైతులకు సేవలు అందిస్తానని, ఆయన ఈ సందర్భంగా తెలిపారు.


# విద్యతో ఉజ్వల భవిష్యత్తు
### ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి
### ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ కోటేశ్వరబాబు



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 14:** శ్రీకాళహస్తి విద్యతో ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని ప్రముఖ సంఘ సేవకులు, ఆంధ్రశ్రీ అవార్డు గ్రహీత, ఏపీడబ్ల్యుజే రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు అన్నారు. శ్రీకాళహస్తి పట్టణం చెంచులక్ష్మీ కాలనీలోని ప్రభుత్వ మోడల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు సోమవారం విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యాసామగ్రీ పంపిణీ కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో చెంచులక్ష్మీ కాలనీలోని పాఠశాలలో 65 మంది విద్యార్థిని విద్యార్థులకు నోటుపుస్తకాలు, పలకలు వంటి విద్యాసామగ్రిని అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోటేశ్వరబాబు మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాదన్నారు. ఉన్నత చదువులు చదువుకుని జీవితంలో గొప్పస్థాయికి ఎదగాలన్నారు. చదువుతో గౌరవం, విలువలు లభిస్తాయని తెలిపారు. కష్టంగా కాకుండా ఇష్టపడి చదివి భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలన్నారు. తద్వారా కన్నతల్లిదండ్రులు, విద్యనేర్పిన గురువులకు, మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని అకాంక్షించారు. పేద విద్యార్థుల విద్యకు తనవంతుగా సాయం అందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నానని చెప్పారు. అందులో భాగంగానే ప్రతియేటా విద్యా సామగ్రి, పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ చేస్తున్నానని తెలిపారు. విద్యలో ప్రతిభ చూపి మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సహాక బహుమతులను కూడా అందించిన విషయాన్ని గుర్తుచేశారు. అనంతరం కోటేశ్వరబాబు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి పురుషోత్తం, షేక్ మస్తాన్, ప్రధానోపాధ్యాయులు రమణ దాసు, ఉపాధ్యాయులు, ఉదయ్ కుమార్ చిరంజీవులు ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక వినతుల స్వీకరించిన
### కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఐఏఎస్





**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూల్కై 14:** ప్రజలసమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడింది. ఈ సమావేశానికి కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్,ఐఏఎస్ నేతృత్వం వహించారు. వివిధ శాఖల మండల, డివి జనల్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పింఛన్లు, భూమిసమస్యలు ఉద్యోగసమస్యలు, ఆరోగ్య సమస్యలు తదితర ప్రజలనుండి అభ్యర్థనలు స్వీకరించబడ్డాయి. సమస్యలను వినతి పత్రాల రూపంలో తీసుకుని సంబంధిత శాఖలకు పంపించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు జారీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ PGRS కార్యక్రమం ద్వారా ప్రజలనుండి అనేక సమస్యలు స్వీకరించు చున్నామని సాధ్యమైన వాటిని వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ప్రజలనుండి స్వీకరించిన అర్జీలలో పెండింగ్లో ఉన్న ఆర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేకదిష్టి సారిం చాలన్నారు. ప్రతి అర్జీని నిర్ణీత గడువు లోపల పరిష్కరించాల్సి ఉంటుందని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఐఏఎస్ తెలిపారు.

# సామాజిక గ్రూపు అడ్మిన్లు జాగ్రత్త:
## కుప్పం డీఎస్పీ పార్థసారథి



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 14:** కుప్పంపట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన డి.ఎస్.పి పార్థసారథి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాజిక మాధ్యమాల్లో గ్రూప్ అడ్మిన్లు జాగ్రత్తగా ఉండాలని, గ్రూప్ సభ్యులు ఏవైనా పోస్ట్ చేస్తే అందుకు అడ్మిన్‌సోలో బాధ్యత వహించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. అవాస్తవాలను వైరల్ చేస్తే గ్రూప్ అడ్మిన్ పైనే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. గ్రూపుల్లో ఎవరు పడితే వాళ్లు, ఏది పడితే అది పోస్ట్ చేయకుండా నియంత్రణ ఉంచు కోవాలని తెలియజేశారు.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
జాతీయ తెలుగు దినపత్రిక
APTEL/2024/86143



# రేషన్ కార్డు అంటే పేదవారి ఆత్మగౌరవం.. గుర్తింపు

-మొదటిపేజీ తరువాయి

కొలువు తీరి రెండేళ్లు పూర్తయ్యే సరికి 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం.. ఆయన హయాంలోనే కూలేశ్వరం అయ్యిందని ఎద్దేవా చేశారు. కూలేశ్వరం ప్రాజెక్టు దగ్గరే వారిని ఉరి తీసినా తప్పు లేదన్నారు. ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా? అంటూ బీఆర్ఎస్ నేతలకు ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు.

మూడు అడుగులున్న స్థానిక నేత ఎగిరెగిరి పడుతున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్లు అవకాశం ఇచ్చినా తుంగతుర్తికి నీళు ఎందుకు తేలేదంటూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డిని సీఎం సూటిగా ప్రశ్నించారు. తుంగతుర్తికి నీరు తేవడమంటే.. గ్లాస్‌లో సోడా పోసినట్లు కాదంటూ బీఆర్ఎస్ నేతకు ఈ సందర్భంగా చురకలంటించారు. దొర ముందు చేతులు కట్టుకుని గ్లాస్‌లో సోడా పోయడమే నీకు తెలుసంటూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డిపై మండిపడ్డారు. సొంత మండలానికి ఎమ్మార్వో, ఎంపీడీవో ఆఫీస్‌లే కాదు.. పోలీస్ స్టేషన్ సైతం తెచ్చుకోలేని ఘనత బీఆర్ఎన్ నేతలదంటూ వ్యంగ్యంగా అన్నారు. పోరాట యోధులను అందించిన గడ్డ నల్గొండ అని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. నాడు గంజికి లేని మూడు అడుగుల నాయకుడు.. నేడు బెంజి




కార్లలో తిరుగుతున్నారంటూ జగదీశ్వర్ రెడ్డిపై వ్యంగ్య బాణాన్ని సీఎం రేవంత్ రెడ్డి సంధించారు. తెలంగాణలో కొత్తగా 3.58 లక్షల రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కొత్త రేషన్ కార్డుల ద్వారా 11.3 లక్షల మందికి లబ్ధి చేకూరతుందన్నారు. తెలంగాణలో మొత్తం 95.56 లక్షల మంది రేషన్ కార్డులు అందుకున్నారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# నేడు న్యూఢిల్లీకి సీఎం చంద్రబాబు

-మొదటిపేజీ తరువాయి

చంద్రబాబు నాయుడు వేర్వేరుగా సమావేశం కానున్నారు.

అలాగే నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వికె సారస్వత్, ఢిల్లీ మెట్రో ఎండీతో సైతం సీఎం చంద్రబాబు భేటీ అవనున్నారు. ఇక ప్రధాని సంగ్రహాలయలో మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నర్సింహారావు జీవితంపై సీఎం చంద్రబాబు నాయుడు ప్రసంగించనున్నారు. అలాగే భారత పరిశ్రమ సమాఖ్య-సీఐఐ స్వర్ణాంధ్రప్రదేశ్ సాకారంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు పాల్గొనున్నారు.

## న్యూఢిల్లీలో సీఎం చంద్రబాబు షెడ్యూల్ ఇలా..

జులై 15వ తేదీ మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల మధ్య కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో ఆయన నివాసంలో సీఎం చంద్రబాబు భేటీ కానున్నారు.

మధ్యాహ్నం 2. 30 గంటలకు సీఎం చంద్రబాబుతో ఆయన అధికారిక నివాసంలో నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ సమావేశం కానున్నారు.

మధ్యాహ్నం 3.00 గంటలకు సీఎం చంద్రబాబును ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో ఢిల్లీ మెట్రో ఎండీ కలవనున్నారు.

సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ప్రధాని సంగ్రహాలయను సీఎం చంద్రబాబు సందర్శించనున్నారు. అనంతరం మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు సంస్మరణ సభలో 'పీవీ జీవితం, వారసత్వం'పై ఆయన కీలక ప్రసంగం చేయనున్నారు.

సాయంత్రం 7.00 గంటలకు కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం చంద్రబాబు భేటీ కానున్నారు.

బుధవారం అంటే.. జులై 16వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం భేటీ కానున్నారు. అనంతరం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఆయన సమావేశం కానున్నారు.

రాత్రి 7 గంటలకు సీఐఐ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టులు, వాటికి అవసరమైన నిధులు, పోలవరం - బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు సహా పలు అంశాలపై కేంద్ర మంత్రులతో ముఖ్యమంత్రి చర్చించనున్నారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ సాకారంపై టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్‌ను ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో చేపట్టాల్సిన ప్రాజక్టులు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల ఆదాయ పెంపుదల తదితర అంశాలతో పాటు.. దేశంలో అధిక వృద్ధి రేటు సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ టాస్క్ ఫోర్స్ అధ్యయనం చేసిన విషయం విదితమే. సీఐఐ నిర్వహిస్తున్న కార్యక్రమంలో సీఎం చంద్రబాబుకు ఈ టాస్క్‌ఫోర్స్ నివేదికను అందజేయనుంది.

అనంతరం... రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సీఐఐ పోషించాల్సిన కీలక పాత్రపై సీఎం చంద్రబాబు ప్రసంగించనున్నారు.

గురువారం అంటే.. జులై 17వ తేదీ ఉదయం 9 గంటలకు సీఎం చంద్రబాబు నాయుడు విజయవాడకు తిరుగు ప్రయాణం కానున్నారు.

తెలుగు రాష్ట్రాల సీఎంలు సమావేశం..!

మరోవైపు.. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు న్యూఢిల్లీలో భేటీ అయ్యే అవకాశమున్నట్లు తెలుస్తుంది. కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో వీరిద్దరు భేటీ అయ్యే అవకాశమున్నట్లు సమాచారం. పోలవరం - బనకచర్ల ప్రాజెక్ట్‌పై తెలంగాణలో పలు రాజకీయ పార్టీల నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బనకచర్ల ప్రాజెక్ట్‌పై కేంద్రం నుంచి వచ్చిన అభ్యంతరాలపై ఏపీ ఇప్పటికే సమాధానం ఇచ్చింది. అయితే దీనిపై చర్చలే ముఖ్యమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు సైతం ఇదే అంశాన్ని ప్రస్తావించారు. దీంతో ఈ అంశంపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో వీరిద్దరు సమావేశమయ్యే అవకాశముందని తెలుస్తుంది. ఇక సీఎం చంద్రబాబు రెండు రోజుల న్యూఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీ కానున్నారు. అలాగే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా బుధవారం న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. ఆయన సైతం అదే రోజు కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌లో సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల మధ్య ప్రాజెక్టులు, నీటి కేటాయింపులతోపాటు పోలవరం - బనకచర్ల ప్రాజెక్ట్‌పై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో ఈ సీఎంలు ప్రాథమిక చర్చలు జరపనున్నట్లు తెలుస్తోంది. అయితే పోలవరం - బనకచర్లపై కేంద్రం లేవనెత్తిన అంశాలపై సీఎం చంద్రబాబు ఇప్పటికే సమగ్ర నోట్స్ తయారు చేసినట్లు సమాచారం. అలాగే ఈ ప్రాజెక్ట్‌పై తెలంగాణ తెరపైకి తీసుకు వచ్చిన అంశాలను కూడా ఈ సందర్భంగా చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్.. తెలుగు రాష్ట్రాల సీఎంలకు ఒకే సారి అపాయింట్‌మెంట్ ఇచ్చారా? లేకుంటే వేర్వేరుగా ఇచ్చారా ? అనే అంశంపై ప్రస్తుతానికి స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో వీరి భేటీపై కొంత సందిగ్ధత నెలకొంది.

# మా ఓపికను చేతగానితనంగా తీసుకోవద్దు

-మొదటిపేజీ తరువాయి

'రాజ్యాంగాన్ని, చట్టాలను చంద్రబాబు ప్రభుత్వం చాలా దారుణంగా దుర్వినియోగం చేస్తోంది. దీన్ని నియంతృత్వం అనాలా..? ఏమనాలి.?. అన్ని వ్యవస్థలను చంద్రబాబు దారుణంగా వినియోగిస్తున్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బ తీశారు. టీడీపీ చెప్పినట్టు వినకపోతే వేధిస్తున్నారు. పోలీస్ వ్యవస్థను పూర్తిగా తప్పుడు కేసులు కోసం వాడుతున్నారు. వైఎస్సార్‌సీపీ సమావేశానికి వెళుతున్నందుకు జెడ్పీ ఛైర్మన్ ఉప్పాల హారికపై దాడి చేశారు. టీడీపీ వాళ్ళు గుడివాడలో దారి కాసి గొడవలు చేశారు. పోలీసులు ఉండగానే గంటన్నర సేపు గుండాలు మహిళ జెడ్పి ఛైర్మన్‌పై దాడికి దిగారు. పోలీసులు రక్షణలో వాళ్ళు దాడులు చేశారు.కారుని పోలీసులు తాళ్ళు కట్టి తీసుకెళ్లాలని యత్నించారు. పోలీసులు దాడి చేస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. టీడీపీ నాయకులు జెడ్పీ ఛైర్మన్ ఉప్పాల హారికపై దాడి చేస్తుంటే ఆపే ప్రయత్నం చేయలేదు. దాడులు జరపకుండా నిలువరించలేదు. తాము అధికారంలో ఉన్నామని,మా గురించి ఎవరు గొంతెత్తి మాట్లాడకూడదని దాడులు చేస్తున్నారు.

పోలీసులు ఎందుకు ఇంత దారుణంగా వ్యవహరిస్తున్నారు. ఈరోజు తప్పించుకోవచ్చు కానీ అందరూ చట్టం ముందు నిలబడాల్సి ఉంటుంది. దాడి చేసి తిరిగి ఉప్పాల రాముపై అక్రమ కేసు పెట్టారు. మాదాల సునీత అనే మహిళతో ఫిర్యాదు చేయించారు. ఆమె ఫ్లెక్సీలు చించారు. గాయం అయితే కారుతో గుద్దినట్టు కేసు పెట్టారు. ఉప్పాల రాము వెనకాల సీట్లు కూర్చొని ఉంటే ఆయన గుద్దించినట్టు కేసు పెట్టారు.

ఎలాగైనా కేసులు పెడతాం అన్నట్టు ఇష్టానుసారం కేసులు పెట్టేస్తున్నారు. హైకోర్టు అన్ని కోర్టులకు మెకానికల్‌గా రిమాండుకు పంపొద్దు అని ఆదేశాలు ఇచ్చింది. న్యాయస్థానాలపై భయం లేకుండా ఇలాంటి కేసులు పెడుతున్నారు. వైఎస్ జగన్ బంగారు పాళ్యం పర్యటనకు వేలాది మంది రైతులు వచ్చారు. దానికి ఎల్లో మీడియా ఫోటోగ్రాఫర్ వస్తే దాడి చేశారని కేసు పెట్టారు.

ఎఫ్ఐఆర్‌ని మార్చి మరి తప్పుడు కేసు పెట్టారు.నెల్లూరులో ప్రసన్న కుమార్ రెడ్డి ఇంటిపై టీడీపీ వాళ్ళు దాడి చేశారు. పోలీసులు ఉండగానే ప్రసన్న కుమార్ ఇంటిపై దాడి




చేశారు.వాళ్ళ ముందే వస్తువులను కాల్చారు. వారం రోజులైనా ఎవరిపైనా కేసు పెట్టలేదు.

ప్రసన్న కుమార్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

తాడిపత్రిలో పెద్దారెడ్డిని హైకోర్టు చెప్పినా నియోజకవర్గంలోకి రానివ్వలేదు. పొదిలి, బంగారు పాళ్యం అన్ని చోట్లా తప్పుడు కేసులు పెట్టారు. మా ప్రభుత్వం వచ్చాక తప్పుడు కేసులు అన్నింటినీ మళ్ళీ ఓపెన్ చేస్తాం. తప్పుడు కేసుల్లో ఉన్న అధికారుల పైన కూడా విచారిస్తాం. మా ఓపికను చేతకాని తనంగా తీసుకోవద్దని సూచించారు.

# మళ్లీ తెరపైకి కేబినెట్ విస్తరణ

**హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్ లో రాజకీయాలు నిరంతరం వేడిపుట్టిస్తూనే ఉంటాయి. మంత్రి వర్గ విస్తరణ అధినాయకత్వం ఎలాగోలా పూర్తి చేసింది. రేవంత్ రెడ్డి కేబినెట్ లో మొన్నటి వరకూ మొత్తం ఆరు పోస్టులు ఖాళీగా ఉండగా అందులో మూడింటిని మాత్రమే భర్తీ చేశారు. ఎస్సీలో మాల, మాదిగ సామాజికవర్గానికి చెందిన నేతలతో పాటు బీసీ సామాజికవర్గానికి చెందిన నేతకు ఇచ్చారు. మంత్రివర్గం విస్తరణ జరిగిన వెంటనే కొంత అసంతృప్తులు బయటకు వచ్చినప్పటికీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షినటరాజన్ లు అసంతృప్త నేతలను బుజ్జగించారు. స్థానికసంస్థల ఎన్నికల తర్వాత మిగిలిన మూడు పోస్టులను భర్తీ చేస్తామని పార్టీ హైకమాండ్ చెబుతుంది. అయితే తనకు మంత్రి పదవి దక్కని నేతలు మాత్రం పార్టీ కార్యక్రమాలకు దూరంగానే ఉంటున్నారు. తమ నియోజకవర్గానికి మాత్రమే పరిమితమవుతున్నారు. అంతే తప్ప తాము రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై వారు స్పందించడం లేదు. భవిష్యత్ లోనూ మంత్రి పదవి దక్కుతుందన్న గ్యారంటీ మాత్రం లేదని తెలిసిన తర్వాత పూర్తిగా నిరుత్సాహంలో పడిపోయారు. అందులో ప్రధానంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఒకరు. ఆయన తనకు మంత్రి పదవి తప్పకుండా వస్తుందని భావించారు. ఎన్నికలకు ముందు బీజేపీ నుంచి కాంగ్రెస్ లో చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మునుగోడు నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అయితే అనేక కారణాల వల్ల ఆయనకు మంత్రి పదవి దక్కలేదు.. తనకు మంత్రి పదవి వస్తుందని, హోంమంత్రి పదవి ఆశిస్తున్నట్లు కూడా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మీడియా చిట్ చాట్ లో అన్నారంటే ఆయన ఎంత కాన్ఫిడెన్స్ గా ఉన్నారో అర్థమవుతుంది. తనతో పాటు బీజేపీ నుంచి కాంగ్రెస్ లో చేరిన గడ్డం వివేక్ కు మంత్రి పదవి దక్కినా తనకు దక్కకపోవడానికి ప్రధాన కారణం రెడ్డి సామాజికవర్గమేనని అందరికీ తెలుసు. దీంతో పాటు జిల్లా కూడా ఒక కారణం. ఇప్పటికే నల్లగొండ జిల్లా నుంచి తన సోదరుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఉన్నారు. మరో పదవి ఇవ్వాలంటే ఒక కుటుంబంలో ఇద్దరికి అనేది పార్టీ హైకమాండ్ కు కూడా ఇబ్బందికరంగా మారింది. అందువల్లనే మొన్న మంత్రి వర్గ విస్తరణలో రెడ్డి సామాజికవర్గాన్ని పూర్తిగా పక్కన పెట్టేశారు.. ఇక ఇప్పుడు త్వరలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరగనుంది. మంత్రివర్గంలో ముస్లిం సామాజికవర్గానికి చెందిన వారు లేరు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రానున్న మూడు పోస్టులు కూడా ప్రాంతాల పరంగా, సామాజికపరంగా ఇతరులకు కేటాయించే అవకాశముందన్న సమాచారం అందడంతోనే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సైలెంట్ గా ఉన్నారని తెలిసింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల వరకూ కొంత సంయమనాన్ని పాటించి తర్వాత రాజగోపాల్ రెడ్డి తన అసంతృప్తిని బహిరంగంగా వెళ్ల గక్కే అవకాశముంది. చూస్తుంటే ఆ మూడు పోస్టులను కూడా ఇతర సామాజికవర్గాలకు, బలహీనవర్గాలకు కేటాయించి రెడ్ల వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టేయాలన్న యోచనలో హైకమాండ్ ఉన్నట్లు తెలిసింది. మొత్తం మీద మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్న రెడ్డి సామాజికవర్గం నేతలకు మాత్రం ఈసారి కూడా ఆశాభంగమే ఉంటుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

## కాంగ్రెస్ పార్టీ బీసీల చాంపియన్




**హైదరాబాద్:** తెలంగాణ బీజేపీ నేతలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ వ్యాఖ్యలకు పొన్నం కౌంటరిచ్చారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి వచ్చే నిధులను ఆయనే ఆపుతున్నారని ఘాటు విమర్శలు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ పార్టీ బీసీల చాంపియన్. గుడ్డుకు వెంట్రుక కట్టే పని పెట్టుకోవద్దని బీజేపీ నేతలకు విజ్ఞప్తి చేస్తున్నాం. బీజేపీ నేతలు అరవింద్, బండి సంజయ్, ఈటల రాజేందర్, లక్ష్మణ్, కృష్ణయ్య గారు బీసీ రిజర్వేషన్లకు మద్దతు తెలపాలని కోరుతున్నాం. తెలంగాణ కుల గణన విప్లవాత్మక నిర్ణయమని స్వయానా వారణాసి ప్రజా ప్రతినిధి (ఆర్ఎస్ఎస్)నేత నాతో అన్నారు. బీజేపీ నేతలు దుర్బుద్ధిని వీడండి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.. అంతకంటే ముందు ఇచ్చిన హామీ మేరకు స్పష్టమైన విధానంతో కుల సర్వే నిర్వహించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల చట్టం తీసుకొచ్చాం. చట్టం 3, 4 ప్రకారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తాం. బీజేపీ లక్ష్మణ్ అసహనంతో మాట్లాడున్నారు. రాష్ట్రానికి కేంద్రం నిధులు మీరే ఆపారు. చట్టపరమైన అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని బీసీ రిజర్వేషన్ల బిల్లును ముందుకు తీసుకెళ్తున్నాం. కడుపులో కత్తులు పెట్టుకొని మాట్లాడకండి. బీసీ రిజర్వేషన్ల పట్ల మాకు చిత్త శుద్ధి ఉంది. రాష్ట్రపతి ఆమోదం పొందించి తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చేలా కేంద్రాన్ని ఒప్పించండి. ఫ్యూడల్ సిద్ధాంతాలతో అడ్డుపడకండి. బిల్లు చట్టబద్ధత కోసం సీఎం రేవంత్, మంత్రులందరం సిద్ధంగా ఉన్నాం.. మీ నాయకులను తీసుకుని రండి ఢిల్లీకి వెళ్దాం. బీఆర్ఎస్ అధ్యక్ష పదవి, కార్యనిర్వాహక పదవి బీసీలకు ఇవ్వలేరా?. ఆర్డినెన్సు తీసుకొచ్చే అవకాశం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. బీఆర్ఎస్, బీజేపీ రెండు ఒక్కటే.. దొంగ దొంగ అంటూ డ్రామాలు చేస్తున్నారు. ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కోసం 50 శాతం ఎత్తేసినపుడు.. బీసీ రిజర్వేషన్లు ఎందుకు సాకారం కాదు అని ప్రశ్నిస్తున్నా. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ పార్టీ అయినా సరే గెలిచేది బీసీ అభ్యర్థి అనే విషయం మరిచిపోకూడదు. బీసీ రిజర్వేషన్లుకు మద్దతు ఇవ్వాల్సిందిగా అన్ని పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నా' అంటూ వ్యాఖ్యలు చేశారు.

## 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీగా తెలంగాణ

-మొదటిపేజీ తరువాయి

తీయాలన్న ఆలోచన వచ్చినందుకు మూవీ టీమ్‌ను అభినందిస్తున్నా. నలభయేళ్ల క్రితం రామాయణం సీరియల్ అందరికీ చేరువైంది. కొవిడ్ సమయంలో మళ్లీ ఆ సీరియన్‌ను టెలికాస్ట్ చేస్తే ప్రపంచ రికార్డు సృష్టించింది. 2035లోపు తెలంగాణను 1 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దాలని మేం సంకల్పించాం. 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీగా ఉండేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. దీనికోసం 2047 విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసుకుంటున్నాం. ఇందులో సినీ రంగానికి ప్రత్యేక చాప్టర్ ఉంటుంది. నాడు రామానంద్ సాగర్ తీసిన రామాయణం సీరియల్ ఎంత పాపులర్ అయిందో.. 'శ్రీమద్భాగవతం పార్ట్-1' కూడా అంత హిట్ అవ్వాలని కోరుకుంటున్నా" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి..

-మొదటిపేజీ తరువాయి

వదిలేస్తున్నారని, కానీ నేను కడుపులో పెట్టుకుని కాచుకుంటున్నాని చెప్పారు. కాలం తీరితే ఎవరు ఏది అనుభవించాలో అది అనుభవిస్తారని, తాను అడ్డురానని పేర్కొన్నారు. 'బోనాల జాతరకు సంతోషంగా సాకలు పోసి బాగా చేశారు. ప్రతీసారి చేసినట్టే ఈ సారి కూడా పొరపాటు చేశారు. ప్రతి సంవత్సరం చెబుతునా.. నా బిడ్డలను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటాను. నా పూజలు అన్ని సక్రమంగా జరిపించాలి. వేల రాసులు నేను రప్పించుకుంటున్న. నాకు రక్తం బలి ఇవ్వడం లేదు. మీరు మాత్రం ఆరగిస్తారు. నాకు మాత్రం ఇవ్వడం లేదు.. నాకు సరిగ్గా పూజలు చెయ్యకపోతే రక్తం కక్కుకొని చస్తారు. నాకు పూజలు సరిగ్గా జరిపించడం లేదు.. అందుకే మరణాలు పెరుగుతున్నాయి. నేను అస్సలు ఆ విషయంలో అడ్డుపడను. నాకు రక్తం బలి కావాలి. నన్ను కొలిచే వారికి నేను ఎప్పుడు తోడుగా నిలబడుతాను. రాబోయే రోజుల్లో మహమ్మారి వస్తుంది. ప్రజలు జాగ్రత్త ఉండాలి. అగ్ని ప్రమాదాలు బాగా జరుగుతాయి. ఈ సంవత్సరం కూడా వర్షాలు బాగా కురుస్తాయి. ఐదు వారాలు పాటు నాకు పూజలు, సాక పోసి ఆనంద పరచాలి. నాకు రక్తం చూపించండి లేకపోతే అల్లకల్లోలం జరుగుతుంది. నా రూపాన్ని పెట్టడానికి కూడా అడ్డుపడుతున్నారు.' అని మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు.

## బీసీలకు కాంగ్రెస్ అన్యాయం..

-మొదటిపేజీ తరువాయి

ఇవాళ(సోమవారం) నల్గొండ జిల్లాలో రామచందర్‌రావు పర్యటించారు. ఆయనకు బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. బీజేపీ నేతలకు రాబోయే ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనేనని నొక్కిచెప్పారు. తమ కార్యకర్తల కళ త్వరలో నెరవేరబోతుందని ఉద్ఘాటించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గ్రామగ్రామాన కాషాయం జెండా ఎగరవేయాలని బీజేపీ శ్రేణులకు మార్గనిర్దేశం చేశారు. కాంగ్రెస్‌కి ఓట్లు వేసి ప్రజలు బాధపడుతున్నారని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుటుంబ పార్టీలని.. నల్లగొండలో ఆ రెండు పార్టీల్లోని కుటుంబాలే పరిపాలిస్తున్నాయని విమర్శించారు. మతపరమైన రిజర్వేషన్లను తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. బీసీలకు కాంగ్రెస్ అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలపై బీజేపీ పోరాడుతోందని స్పష్టం చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనను చూశారని.. బీజేపీకి ఒక అవకాశం ఇవ్వాలని రామచందర్‌రావు కోరారు.

## ఆరాంఘర్ లో ఆర్టీసీ బస్ స్టేషన్...

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో రాష్ట్ర, అంతర్రాష్ట్ర బస్సుల కోసం మరో భారీ బస్ టెర్మినల్ అందుబాటులోకి రానుంది. మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే అంతర్రాష్ట్ర బస్సుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ఇంటర్‌స్టేట్ బస్ టెర్మినల్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రస్తుతం పొరుగు రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సులు నగరంలో ట్రాఫిక్‌జామ్ సమస్యల కారణంగా ఎంజీబీఎస్‌కు (మహాత్మా గాంధీ బస్ స్టేషన్) ఆలస్యంగా చేరుకుంటున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా ఆధునిక బస్ టెర్మినల్ ఏర్పాటుకు ఆర్టీసీ అధికారులు ప్రణాళిక రూపొందించారు.జాతీయ రహదారి 44కు పక్కనే ఆరాంఘర్‌లో 7.22 ఎకరాల స్థలాన్ని ఆర్టీసీ గుర్తించింది. ఈ స్థలంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ (ఐసీఎస్‌డబ్ల్యూ) భవనాలున్నాయి. వాటికి పరిహారంగా రూ. 6 కోట్లు చెల్లించేందుకు ఆర్టీసీ ముందుకు వచ్చింది. ఈ భూమిని ఆర్టీసీ బస్ టెర్మినల్‌కు కేటాయించాలని కోరుతూ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 2025 జనవరి 25న రెవెన్యూశాఖకు లేఖ రాశారు. అయితే ఆరు నెలలు దాటినా ఈ అంశం ఇంకా కొలిక్కిరాలేదు. ఈ భూకేటాయింపు ప్రతిపాదన రంగారెడ్డి కలెక్టరేట్‌లో పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే నగరంలో ఇంటర్‌స్టేట్ బస్ టెర్మినల్ ఏర్పాటుకు అడుగు పడుతుంది.ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో రెండు ప్రధాన భారీ బస్ టెర్మినల్స్ ఉన్నాయి మహాత్మా గాంధీ బస్ స్టేషన్ హైదరాబాద్‌లోని అతిపెద్ద, ముఖ్యమైన బస్ స్టేషన్లలో ఒకటి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు, అలాగే పొరుగు రాష్ట్రాలకు వెళ్లే బస్సులకు ఇది ప్రధాన కేంద్రం. ప్రతిరోజు లక్షలాది మంది ప్రయాణికులు దీని ద్వారా రాకపోకలు సాగిస్తారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ సమీపంలోని జుబ్లీ బస్ స్టేషన్ ప్రధానంగా ఉత్తర తెలంగాణ జిల్లాలైన కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులకు సేవలందిస్తుంది. కొత్త బస్ టెర్మినల్ అందుబాటులోకి వస్తే దక్షిణ తెలంగాణ జిల్లాల నుండి వచ్చే బస్సులకు, అలాగే

1ఎం1బి ఫ్యూచర్ రెడీ ఇన్స్టిట్యూషన్‌గా

## కుప్పం ఇంజనీరింగ్ కళాశాల

## వైస్ చైర్మన్ సునీల్ రాజ్



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 14:**
ఫ్యూచర్ రెడీ ఇన్స్టిట్యూషన్‌గా కుప్పం ఇంజనీరింగ్ కళాశాల మారింది.వన్ మిలియన్ వన్ బిలియన్ సంస్థతో ఒప్పందం చేసుకున్న కుప్పం ఇంజనీరింగ్ కళాశాల పరిశ్రమతో సమ లేఖనం చేసిన నైపుణ్య అభివృద్ధి,విద్యార్థులకు మెరుగైన ప్లేస్మెంట్స్ కల్పించడంతోపాటు గ్లోబల్ ఎక్స్పోజ ర్ పైదృష్టి పెట్టడానికిఅవకాశం ఉంటుంది. 2014లో స్థాపించిన ఈ కళాశాల 1ఎం 1బి ఐక్యరాజ్యసమితితో ప్రత్యేక సంప్రదింపుల హోదా కలిగిఉండడం ప్రత్యేకత. అంతేకాకుండా ఐక్యరాజ్యసమితి గ్లోబల్ కమ్యూనికేషన్ విభాగానికి అనుబంధం గా ఉంది. ప్రధానంగా భారతదేశం నుండి యువత నేతృత్వంలోని ఆవిష్కరణలు, గొప్ప మార్పు తయారీదారులను న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో ప్రతి ఏటా జరిగే 1ఎం 1 బి ఆక్టివేట్ ఇంపాక్ట్ సమ్మిట్ లో పాల్గొని ప్రదర్శించడానికి అవకాశం కల్పిస్తుంది. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ బాబు, 1ఎం1బి లీడ్ సస్టైనబిలిటీ దీపిక వెంకటేష్ ప్లేస్మెంట్ ఆఫీసర్ జయ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ సునీల్ రాజు మాట్లాడుతూ ఈ ఎం ఓయూ ద్వారా కుప్పం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులను వాస్తవ ప్రపంచ సవాళ్లకు, ఉద్భవి స్తున్న కెరీర్ అవకాశాలకు, స్థిరమైన భవిష్యత్తుకు తోడ్పడేలా సాధికారత కల్పించ డంతోపాటు కృత్రిమ మేధస్సు, గ్రీన్ స్కిల్స్ వంటి అభివృద్ధి సాంకేతికతల నైపుణ్యం పై మెరుగైన లక్ష్యాలు ఏర్పరిచేందుకు దోహదం చేస్తాయని పేర్కొన్నారు.

## ఎమ్మెల్యేపై సోషల్ మీడియాలో

## తప్పుడు ప్రచారం చర్యలు తీసుకోండి

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై14:**



శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి పై సామాజిక మాధ్యమాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డీఎస్పీ నరసింహమూర్తిని కోరారు. సోమవారం డీఎస్పీని కలసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎమ్మె ల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిపై కొందరు కావాలనే తప్పుడు వార్తలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారన్నారు. న్యాయవిచారణ పరిధిలో ఉన్న అంశాన్ని రాజకీయం చేస్తూ రెచ్చకొట్టే విధంగా వ్యాఖ్యలుచేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గాప్రసాద్, బాలాజీరెడ్డి, ఖాదర్, వినయ్ కుమార్, సాయి, చందు, బాలాజీ, గిరి తదితరులున్నారు.

## ఒక కోటి ఐదు లక్షల రుపాయలకు

# చేరిన బిట్ కాయిన్ విలువ!



జపర్సనల్ ఫైనాన్సింగ్‌లో బిట్‌కాయిన్ ఒక కొత్త పెట్టుబడి ఎంపికగా మారింది. బిట్‌కాయిన్ ధర లక్షా 20వేల డాలర్ల గరిష్ఠానికి చేరింది. ఇన్వెస్టర్లు దీర్ఘకాలిక పెట్టుబడిగా బిట్‌కాయిన్‌ను పరిగణిస్తున్నారు. క్రిప్టో మార్కెట్‌లో చిన్నచిన్న ఒడిదొడుకులు ఉన్నప్పటికీ, భవిష్యత్తులో బిట్‌కాయిన్ ధర మరింత పెరగవచ్చునని నిపుణులు అంచనా వేస్తున్నారు. పర్సనల్ ఫైనాన్సింగ్ కేటగిరీలో బిట్‌కాయిన్ సరికొత్త పెట్టుబడి ఎంపికగా మారిపోయింది. దీంతో క్రిప్టో కాయిన్ రేటు తన సుదీర్ఘ ప్రయాణంలో 1లక్ష 20వేల డాలర్ల జీవితకాల గరిష్ఠానికి చేరుకుంది. అయితే ఇన్వెస్టర్లలో వచ్చిన అవగాహన, క్రిప్టోల వైపు వారి అడుగులు పెద్ద మార్పుగా పరిగణిస్తున్నట్లు ప్రముఖ క్రిప్టో ఎక్స్ఛేంజీ జియోటస్ సంస్థ పేర్కొంది. ఒకప్పుడు ఇంట్రాడే ట్రేడింగ్ కోసం క్రిప్టోల్లోకి వచ్చిన ఇన్వెస్టర్లు ప్రస్తుతం దానిని ఒక వ్యూహాత్మక దీర్ఘకాలిక అసెట్ క్లాస్ కింద పరిగణిస్తున్నట్లు వాలెట్ చేరికల్లో పెరుగుదల సూచిస్తోందని క్రిప్టో ఎక్స్ఛేంజీ వెల్లడించింది. ప్రస్తుతం వచ్చిన మార్పులు బిట్‌కాయిన్ వేగంగా సంపద సృష్టికి పునాది స్తంభంగా మారుతుందనే లోతైన మార్కెట్ నమ్మకాన్ని ప్రతిబింబిస్తోందని పేర్కొంది. ఇటీవల బిట్‌కాయిన్ తన టెక్నికల్ రెసిస్టెన్స్ లెవెల్ లక్ష 10 వేల డాలర్ల మార్కును అధిగమించటం ర్యాలీకి కారణంగా మారింది. దీనికి తోడు ఎథెరియం, సోలానా, కార్డానో, సుయి వంటి ఇతర కాయిన్స్ కూడా క్రిప్టో ఇన్వెస్టర్ల నుంచి మంచి ఆదరణను పొందుతున్నాయి. డేటా ప్రకారం ఈ ఏడాది బలమైన ట్రెండ్ కొనసాగే అవకాశం ఉందని ఊహించబడింది. ఈ క్రమంలో చిన్నచిన్న ఒడిదొడుకులు ఉన్నప్పటికీ క్రిప్టోల ప్రాభల్యం పెట్టుబడుల ప్రపంచంలో సుస్థిరంగా ముందుకు సాగుతుందని జియోటస్ భావిస్తోంది. ఈ క్రమంలో చాలా మంది ఇన్వెస్టర్లలో ఉండే అనుమానం బిట్‌కాయిన్ ర్యాలీ ఇంకెంత వరకు చేరుకుంటుంది అన్నదే. దీనికి జియోటస్ సీఈవో విక్రమ్ సుబ్బురాజ్ అంచనాలను చూస్తే ఇకపై బిట్‌కాయిన్ ధర లక్షా 35వేల డాలర్ల రేటు వద్ద నిరోధాన్ని ఎదుర్కొంటుందని తెలుస్తోంది. ఇదే క్రమంలో క్రిప్టో ఈటీఎఫ్ పెట్టుబడులు పెరిగితే ఒక్కో బిట్‌కాయిన్ రేటు ఏకంగా లక్షా 50వేల డాలర్ల వరకు చేరుకునే అవకాశం ఉందని విక్రమ్ చెబుతున్నారు. మార్కెట్లలో ఓలటాలిటీ, ప్రాఫిట్ బుక్కింగ్, ఇతర ఒడిదొడుకులు ఉన్నప్పటికీ చాలా మంది తమ పోర్ట్ ఫోలియోలో క్రిప్టోలకు కొంత సముచిత మొత్తాన్ని కేటాయించి ముందుకు సాగటానికి ఇది సరైన సమయంగా జియోటస్ సీఈవో విక్రమ్ సుబ్బురాజ్ అభిప్రాయపడుతున్నారు.

# ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన క్రెడిట్ కార్డ్



నేటి ప్రపంచంలో క్రెడిట్ కార్డులు సర్వసాధారణం అయినప్పటికీ, అమెరికన్ ఎక్స్‌ప్రెస్ సెంచూరియన్ కార్డ్ లేదా బ్లాక్ కార్డ్ వంటి ప్రత్యేక కార్డులు ఉన్నాయి. ఇది అతి ధనవంతులకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఈ కార్డుకు ఆహ్వానం ద్వారా మాత్రమే అర్హత పొందవచ్చు. నేటి ప్రపంచంలో క్రెడిట్ కార్డులు రోజువారీ జీవితంలో ఒక భాగంగా మారాయి. ముఖ్యంగా చాలా మంది వ్యక్తులు ఒకటి కంటే ఎక్కువ క్రెడిట్ కార్డులను కలిగి ఉంటున్నారు. సినిమా టిక్కెట్లపై డిస్కౌంట్లు, రివార్డ్ పాయింట్లు, ఉచిత విమానాశ్రయ లాంజ్ యాక్సెస్ వంటి ప్రయోజనాలను పొందేందుకు వివిధ కార్డులను వాడుతున్నారు. ఈ ప్రోత్సాహకాలు వినియోగదారులకు పరోక్షంగా డబ్బు ఆదా చేయడంలో సహాయపడతాయి. అయితే, క్రెడిట్ కార్డులను జాగ్రత్తగా ఉపయోగించకుండా ఉండటం వల్ల ఆర్థిక నష్టానికి దారి తీయొచ్చు. అయితే క్రెడిట్ కార్డ్ చాలా రకాలు ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన క్రెడిట్ కార్డ్ గురించి తెలుసుకుంటే.. దాన్ని అమెరికన్ ఎక్స్‌ప్రెస్ సెంచూరియన్ కార్డ్ అని పిలుస్తారు. దీనిని అమెక్స్ బ్లాక్ కార్డ్ అని కూడా అంటారు. నివేదికల ప్రకారం.. ఈ కార్డు ఖరీదైనది మాత్రమే కాదు, చాలా ప్రత్యేకమైనది కూడా. ఇది అందరికీ అందుబాటులో ఉండదు. సాధారణ కార్డుల మాదిరిగా దరఖాస్తు చేసుకోలేం. ప్రపంచవ్యాప్తంగా దాదాపు లక్ష మంది మాత్రమే ఈ కార్డును కలిగి ఉన్నారు. భారతదేశంలో దాదాపు 200 మంది మాత్రమే దీనిని కలిగి ఉన్నారని నివేదికలు చెబుతున్నాయి. దీనిని 2013లో భారత మార్కెట్లో ప్రవేశపెట్టారు. అమెక్స్ బ్లాక్ కార్డ్ ఆహ్వానం ద్వారా మాత్రమే ఇస్తారు. అది కూడా చాలా ఎక్కువ ఆదాయం, ఖర్చు చేసే అలవాట్లు ఉన్న వ్యక్తులకు ఇస్తారు. నివేదికల ప్రకారం.. ఈ కార్డు పొందేందుకు అర్హత సాధించడానికి 10 కోట్ల రూపాయల వరకు ఖర్చు చేసే సామర్థ్యం ఉండాలి. ఈ కార్డు కేవలం అతి ధనవంతుల కోసం మాత్రమే అని స్పష్టంగా తెలుస్తోంది. అమెరికన్ ఎక్స్‌ప్రెస్ సెంచూరియన్ కార్డ్ సాధారణ కార్డులు అందించని విలాసవంతమైన అనుభవాలను అందిస్తుంది.

## స్పోర్ట్స్

# తండ్రికి తగ్గ తనయుడు..

# టీమిండియాపై వీరోచిత పోరాటం!



ఇంగ్లండ్ యువ సంచలనం, అండర్-19 ఆటగాడు రాకీ ఫ్లింటాఫ్ తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకుంటున్నాడు. ఇంగ్లండ్ దిగ్గజం ఆండ్రూ ఫ్లింటాఫ్ తనయుడైన రాకీ.. బెకెన్‌హామ్ వేదికగా భారత అండర్-19తో జరుగుతున్న తొలి టెస్టులో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 32 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయం?లో రాకీ ఫ్లింటాఫ్ తన వయసుకు మించిన పరిణతిని ప్రదర్శించాడు. కెప్టెన్ హమ్జా షేక్ తో కలిసి అతను 154 పరుగుల కీలకమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఓ దశలో సునాయసంగా తన సెంచరీ మార్క్‌ను అందుకునేలా కన్పించిన రాకీ.. 93 పరుగుల వద్ద దీపేష్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. అతడి ఇన్నింగ్స్‌లో 14 ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి. మూడో రోజు లంచ్ బ్రేక్ సమయానికి ఇంగ్లండ్ యువ జట్టు తమ తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు కోల్పోయి 338 పరుగులు చేసింది. క్రీజులో అల్బర్ట్(18),ఏకాన్ష్ సింగ్(59) ఉన్నారు. ఇంగ్లండ్ ఇంకా తొలి ఇన్నింగ్స్‌లో భారత్ కంటే 202 పరుగుల వెనకంజలో ఉంది. అంతకుముందు భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 540 పరుగుల భారీ స్కోర్ సాధించింది. భారత బ్యాటర్లలో కెప్టెన్ ఆయుశ్ మాత్రే (102) సూపర్ సెంచరీతో చెలరేగగా.. విహాన్ మల్హోత్రా (67), అభిగ్యాన్ కుందు (90), రాహుల్ కుమార్ (85), ఆర్ఎస్ అంబరీష్ (70) అర్థ సెంచరీలతో రాణించారు.

## చరిత్ర సృష్టించిన ఆసీస్ పేసర్.. 110 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి..



ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ స్కాట్ బోలాండ్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. సమకాలీన బౌలర్లలో ఎవరికీ సాధ్యం కాని అరుదైన ఘనత సాధించాడు. 1915 తర్వాత టెస్టు క్రికెట్‌లో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన ఆటగాడిగా రికార్డులకెక్కాడు. వెస్టిండీస్‌తో మూడో టెస్టు సందర్భంగా బోలాండ్ ఈ ఫీట్ నమోదు చేశాడు. కాగా వెస్టిండీస్ పర్యటనలో భాగంగా ఆస్ట్రేలియా ఆతిథ్య జట్టుతో మూడు టెస్టులు, ఐదు టీ20లు ఆడుతోంది. ఇందులో భాగంగా తొలుత టెస్టు సిరీస్ మొదలుకాగా.. మొదటి రెండు మ్యాచ్‌లు గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకుంది ఆసీస్.

**225 పరుగులకు ఆసీస్ ఆలౌట్**

ఈ క్రమంలో విండీస్- ఆసీస్ మధ్య నామమాత్రపు మూడో టెస్టు జమైకా వేదికగా శనివారం మొదలైంది. కింగ్‌స్టన్‌లోని సబీనా పార్క్ మైదానంలో టాస్ గెలిచిన ఆస్ట్రేలియా తొలుత బ్యాటింగ్ చేసింది. కామెరాన్ గ్రీన్ (46), స్టీవ్ స్మిత్ (48) రాణించడంతో తొలి ఇన్నింగ్స్‌లో 225 పరుగులు చేయగలిగింది. విండీస్ బౌలర్లలో షమార్ జోసెఫ్ నాలుగు వికెట్లు కూల్చగా.. జేడన్ సీల్స్, జస్టిన్ గ్రీవ్స్ తలా మూడు వికెట్లు పడగొట్టారు.

**143 పరుగులకు కుప్పకూలిన విండీస్**

ఇక ఆసీస్ ఆలౌట్ అయిన తర్వాత తమ తొలి ఇన్నింగ్స్ మొదలుపెట్టిన వెస్టిండీస్.. 143 పరుగులకే కుప్పకూలింది. జాన్ కాంప్‌బెల్ చేసిన 36 పరుగులే విండీస్ ఇన్నింగ్స్‌లో టాప్ స్కోర్. దీనిని బట్టి ఆసీస్ బౌలర్ల విజృంభణ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. స్కాట్ బోలాండ్ అత్యుత్తమంగా 13.1 ఓవర్లలో కేవలం 34 పరుగులు ఇచ్చి ఏకంగా మూడు వికెట్లు కూల్చాడు. మిగతా వారిలో కెప్టెన్ ప్యాట్ కమిన్స్, జోష్ హాజిల్‌వుడ్ రెండేసి వికెట్లు పడగొట్టగా.. మిచెల్ స్టార్క్, బ్యూ వెబ్‌స్టర్ ఒక్కో వికెట్ తమ ఖాతాలో వేసుకున్నారు. కాగా వెస్టిండీస్‌తో టెస్టులో ఉత్తమంగా రాణించిన స్కాట్ బోలాండ్.. ఓ అరుదైన రికార్డును సాధించాడు. 1915 తర్వాత టెస్టు క్రికెట్‌లో కనీసం 2000 డెలివరీలు సంధించిన బౌలర్లలో అత్యుత్తమ సగటు కలిగిన ఆటగాడిగా నిలిచాడు. తన నాలుగేళ్ల కెరీర్‌లో 17.33 సగటుతో బోలాండ్ 59 వికెట్లు కూల్చాడు. ఇక 1901- 1914 వరకు ఇంగ్లండ్‌కు ఆడిన సిడ్నీ బార్న్ 16.43 సగటుతో వికెట్లు కూల్చాడు.

1915 నుంచి ఇప్పటికి.. 2000 డెలివరీల తర్వాత అత్యుత్తమ బౌలింగ్ యావరేజ్ కలిగి ఉన్న బౌలర్లు (యాక్టివ్ క్రికెటర్లలో)

స్కాట్ బోలాండ్ (ఆస్ట్రేలియా): 2021-2025- 17.33 సగటుతో 59 వికెట్లు

బెర్ట్ ఐరన్‌మోంగర్ (ఆస్ట్రేలియా): 1928- 1933- 17.97 సగటుతో 74 వికెట్లు

ఫ్రాంక్ టైసన్ (ఇంగ్లండ్): 1954- 1959- 18.56 సగటుతో 76 వికెట్లు

అక్షర్ పటేల్ (ఇండియా): 2021-2024- 19.34 సగటుతో 55 వికెట్లు

జస్‌ప్రీత్ బుమ్రా (ఇండియా): 2018-2025- 19.48 సగటుతో 217 వికెట్లు. ఖ

## దక్షిణాఫ్రికా స్టార్ ఓపెనర్‌కు ఐసీసీ ప్రతిష్టాత్మక అవార్డు



సౌతాఫ్రికా స్టార్ ప్లేయర్ ఐడైన్ మార్‌క్రమ్.. జూన్ నెలకు గాను ఐసీసీ ప్లేయర్ ఆఫ్‌ది మంత్ అవార్డు గెలుచుకున్నాడు. గత నెలలో డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాపై అద్భుత ప్రదర్శనకు గాను మార్‌క్రమ్‌కు ఈ ప్రతిషాత్మక అవార్డు దక్కింది. ఫైనల్ మ్యాచ్‌లో సెంచరీతో చెలరేగిన మార్‌క్రమ్..సౌతాఫ్రికాకు 28 ఏళ్ల తర్వాత తొలి ఐసీసీ టైటిల్‌ను అందించాడు. ఈ మ్యాచ్‌లో బంతితో కూడా అతడు రాణించాడు. ఈ అవార్డు కోసం మార్‌క్రమ్‌తో పాటు తన సహచరుడు టెంబా బావుమా, శ్రీలంక ఓపెనర్ పాతుమ్ నిస్సాంక పోటీ పడ్డారు. కానీ కీలకమైన ఫైనల్లో సెంచరీతో చేయడంతో మార్‌క్రమ్ వారిద్దరిని వెనక్కి నెట్టి ఈ అవార్డును సొంతం చేసుకున్నాడు. ఈ ప్రతిష్టత్మక ఐసీసీ అవార్డు అందుకోవడం తనకు దక్కిన అరుదైన గౌరవమని మార్‌క్రమ్ ఓ ప్రకటనలో పేర్కొన్నాడు. మరోవైపు మహిళల విభాగంలో ఈ అవార్డును వెస్టిండీస్ కెప్టెన్ హీలీ మాథ్యూస్ సొంతం చేసుకుంది. గత నెలలో దక్షిణాఫ్రికా మహిళల జట్టుతో జరిగిన వన్డే, టీ20 సిరీస్‌లలో మాథ్యూస్ అసాధరణ ప్రదర్శన కనబరిచింది. రెండు సిరీస్‌లలోనూ ఆల్ రౌండ్ షోతో మాథ్యూస్ అదరగొట్టింది. దీంతో ఆమె దక్షిణాఫ్రికాకు చెందిన టాజ్మిన్ బ్రిట్స్, వెస్టిండీస్‌స్పిన్నర్ అఫీ ఫ్లెచర్‌లను అధిగమించి ఈ అవార్డును గెలుచుకుంది.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143